
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024

రంజాన్ వేళలు



ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.33 గం.

సహర్ : శనివారం ఉ : 4.56 గం.

ట్రేడింగ్ టిప్స్ పేరిట మోసం

నగరవాసికి రూ. 58.66 లక్షలు టోకరా.. సంగారెడ్డికి చెందిన ఇద్దరు అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో డబ్బులు సంపాదించడానికి టిప్స్ చెబుతామని పలువురిని మోసం చేయడంలో సహకరించిన సంగారెడ్డికి చెందిన ఇద్దరిని హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారి మాయమాటలను నమ్మి మోసపోయిన బాధితుల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్ బల్కంపేటకు చెందిన ఒకరిని ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాం ద్వారా కొందరు సంప్రదించారు. సీక్వోఇయా క్యాపిటల్ బిజినెస్ స్కూల్ పేరిట దందా సాగిస్తూ స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలో టిప్స్ చెబుతామంటూ బురిడీ కొట్టించారు. అతడి నుంచి పెట్టుబడుల రూపంలో మొత్తం రూ. 58.66 లక్షలు కాజేశారు. మోసపోయిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సంగారెడ్డికి చెందిన గడిల సాయిగౌడ్, శీలంకోటి సాయికుమార్‌లను అరెస్టు చేశారు. వారిని విచారించగా పింకు, శరత్ అనే ఇద్దరితో కలిసి ఈ దందా సాగిస్తున్నట్లు ఒప్పుకున్నారు. స్టాక్‌మార్కెట్ పేరిట ఇన్వెస్ట్‌మెంట్ చేయిస్తే 5 శాతం కమీషన్ వచ్చేదని పోలీసులకు చెప్పారు. అంతేకాకుండా బైనాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజీ, యూఎస్ డాలర్ ట్రేడింగ్ పీ2 మీద అదనపు కమీషన్ ఇచ్చేవారని వెల్లడించారు. నిందితుల ద్వారా 45 కేసుల్లో రూ. 13 కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగా 45 కేసులు నమోదైనట్లు పోలీసులు వివరాలు సేకరించారు. వాటిలో 3 కేసులు తెలంగాణలో నమోదయ్యాయి.

విద్యార్థుల యూనిఫాం బకాయిలు విడుదల

సంగారెడ్డి జిల్లాకు రూ. 1.21 కోట్లు

సంగారెడ్డి అర్బన్, మార్చి 21 : సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల యూనిఫాం కుట్టు కూలీ బకాయిలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి యూనిఫాం కుట్టిన దర్జీలు.. చార్జీల కోసం పది నెలలుగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో సుమారు 1.21 లక్షల మంది విద్యార్థులుండగా, ఒక్కొరికి రెండు జతల యూనిఫాం అందజేశారు. కుట్టు కూలీ జతకు రూ.50 చొప్పున దర్జీలకు చెల్లించాలని నిర్ణయించారు. ఈమేరకు రూ. 1.21 కోట్ల నిధులు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాలో జమ చేశారు.

రైతును బలిగొన్న విద్యుత్ కంచె

సంగారెడ్డి జిల్లా కల్హేర్ కొత్తచెరువు తండాలో ఉద్రిక్తత

7లో

నో



చేరికలపై కాంగ్రెస్‌లో కలవరం

- నియోజకవర్గ ఇన్‌చార్జిలతో మంత్రి మాటామంతి
- మహిపాల్‌రెడ్డిని చేర్చుకోవద్దు.. మంత్రికి తేల్చిచెప్పిన కాటా!

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 21 : ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నేతలు కాంగ్రెస్‌లో చేరనున్నారంటూ జరుగుతున్న ప్రచారం ఆ పార్టీ కేడర్‌లో కలవరం కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో వారు కాంగ్రెస్ వర్గాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి తోడు అక్రమ మైనింగ్ కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే జి.మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ఒక్కటే పరిష్కారమని భావించిన మహిపాల్‌రెడ్డి జిల్లాకు చెందిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను సంప్రదించినట్టు తెలిసింది. సానుకూలంగా స్పందించిన మంత్రి.. ఈ విషయంపై పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాటా శ్రీనివాస్‌గౌడ్ అభిప్రాయాన్ని తీసుకున్నారు. అయితే, మహిపాల్‌రెడ్డి చేరికపై కాటా శ్రీనివాస్‌గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గత పదేళ్లుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొని కాంగ్రెస్ కేడర్‌ను కాపాడుకున్నామని, ఇప్పుడు ఆయన కాంగ్రెస్‌లోకి వస్తానంటే ఒప్పుకొనే ప్రసక్తే లేదని కాటా శ్రీనివాస్‌గౌడ్ మంత్రికి తేల్చి చెప్పినట్టు తెలిసింది. దీంతో మహిపాల్‌రెడ్డిని చేర్చుకొనే విషయంలో మంత్రి దామోదర్ ఒక నిర్ణయానికి రాలేకపోతున్నట్టు తెలిసింది.

సంగారెడ్డి, జహీరాబాద్‌లలోనూ..

సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాలలో బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధుల చేరికను అక్కడి కాంగ్రెస్ ఇన్‌చార్జిలు వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి, పలువురు నాయకులు కాంగ్రెస్‌లోకి వస్తామంటున్నారని, ఏం చేద్దామని మంత్రి దామోదర్ రాజనర్సింహ.. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని అడిగినట్టు తెలిసింది. అందుకు ఆయన ససేమిరా అన్నట్టు తెలిసింది. గత ఐదేళ్లు తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నా అప్పటి బీఆర్ఎస్ నేతలు తనను, కాంగ్రెస్ నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేశారని జగ్గారెడ్డి చెప్పినట్టు తెలిసింది. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌లో చేరేందుకు వస్తున్న ముఖ్య ప్రజాప్రతినిధి, ఇతర నేతల గురించి మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రి గీతారెడ్డితో పాటు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన మాజీ మంత్రి చంద్రశేఖర్‌ను సంప్రదించినట్టు తెలిసింది.

అంగీకరించం..

మెదక్ జిల్లాలోని నర్సాపూర్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధితో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహను సంప్రదించినట్టు తెలిసింది. వీరిని చేర్చుకొనే విషయంలో మంత్రి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్న నాయకులకు ఆ జిల్లా నాయకత్వం 'నో' చెబుతున్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ స్థానిక నేతల ఒత్తిళ్లను తట్టుకొని పార్టీని నిలబెట్టామని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అంటున్నారు. ఇప్పుడు ఆ నేతలే మళ్లీ కాంగ్రెస్‌లో చేరి పెత్తనం చెలాయిస్తామంటే ఊరుకోబోమని ఆయన పార్టీ రాష్ట్రస్థాయి ముఖ్య నేతలకు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏమైనా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి, కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్న ముఖ్య ప్రజా ప్రతినిధులు, ఇతర నేతలను స్థానిక కాంగ్రెస్ నేతలు వ్యతిరేకించడం రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

కేసీఆర్ ఇలాకాలో

మున్సిపాలిటీ హస్తగతం

తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మామిండ్ల జ్యోతికృష్ణ ఎన్నిక

- వైస్ చైర్మన్‌తో పోటాపోటీ
- మెజార్టీ సభ్యుల మద్దతుతో చైర్‌పర్సన్‌గా ఎన్నిక

తూప్రాన్, మార్చి 21: కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ పదవిని కాంగ్రెస్ చేజిక్కించుకున్నది. మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా మామిండ్ల జ్యోతికృష్ణ ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మామిండ్ల జ్యోతికృష్ణ చైర్మన్ పదవి ఆశించారు. మెజార్టీ కౌన్సిలర్ల మద్దతుతో మామిండ్ల జ్యోతికృష్ణ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. ఇక్కడ జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 16 స్థానాలకుగాను 13 స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచింది. ఇద్దరు కాంగ్రెస్, ఒకరు బీజేపీ తరఫున విజయం సాధించారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో 8 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించగా, ఈ నెల 6న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 11 మంది సభ్యులు మద్దతు తెలపడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో కొత్త చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ఇన్‌చార్జి చైర్మన్ నందాల శ్రీనివాస్, 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతికృష్ణ మధ్య పోటీ నెలకొన్నది.

ఎన్నిక జరిగింది ఇలా..

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మెదట ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎక్స్‌అఫీషియో సభ్యుడు కూర రఘోత్తంరెడ్డి హాజరయ్యారు. అనంతరం చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న 4వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల జ్యోతి.. జమాల్‌పూర్ లక్ష్మీబాయినర్సజీ, జిన్న భగవాన్‌రెడ్డి, కొడిప్యాక నారాయణగుప్తా, పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, చెలిమెల ప్రియాంకతో కలలిసి హాజరయ్యారు. కొద్దిసేపటి అనంతరం వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, రామునిగారి శ్రీశైలంగౌడ్, బాణాపురం రాజు, చింత రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. కోరం హాజరుకావడంతో ఎన్నికల అధికారి జయచంద్రారెడ్డి చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. చైర్‌పర్సన్‌గా మామిండ్ల జ్యోతికృష్ణ పేరును భగవాన్‌రెడ్డి ప్రతిపాదించగా, నారాయణగుప్తా బలపరిచారు. అనంతరం ఏ ఒక్కరి నుంచి నామినేషన్లు రాకపోవడంతో మామిండ్ల జ్యోతి కృష్ణ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించి, ప్రమాణ స్వీకారం చేయించారు. తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడం నుంచి, నూతన చైర్‌పర్సన్ ఎన్నిక వరకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి కీలకంగా వ్యవహరించారు.



తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన జ్యోతికృష్ణ

అంగన్‌వాడీ టీచర్ నుంచి చైర్‌పర్సన్‌గా..

తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మామిండ్ల జ్యోతి కృష్ణ అంగన్‌వాడీ టీచర్ నుంచి మున్సిపల్ చైర్మన్‌గా ఎదిగారు. అంగన్‌వాడీ టీచర్‌గా రాజీనామా చేసి 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున 4వ వార్డు నుంచి పోటీ చేశారు. తూప్రాన్ మున్సిపాలిటీలోనే అత్యధిక 626 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అవిశ్వాస తీర్మానం అనంతరం జరిగిన పరిణామాల్లో మెజారిటీ సభ్యుల మద్దతు కూడగట్టి చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.



చైర్‌పర్సన్, నర్సారెడ్డిని సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మల్లన్నగుట్ట ఘటనలో

ఇరువర్గాలపై కేసు

దుబ్బాక, మార్చి 21 : దుబ్బాక మండలం రేకుల కుంట మల్లికార్జున ఆలయం (మల్లన్నగుట్ట)లో బుధవారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు. ఆలయంలో ఇటీవల కమ్మర్‌పల్లికి చెందిన పదిమంది పయ్యావుల వర్గానికి చెందిన వారికి పూజలు చేయడానికి అనుమతినిస్తూ దేవాదాయశాఖ గుర్తింపు కార్డులను జారీ చేసింది. దీనికి అభ్యంతరం తెలుపుతూ.. మల్లాయపల్లికి చెందిన చెరుకూరి వర్గం, రేకులకుంటకు చెందిన కోటిపూజారులు కలిసి అడ్డుకున్నారు. 20 ఏళ్ల నుంచి నుంచి పయ్యావుల వర్గం మల్లన్నగుట్టలో పూజలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. కొత్తగా గుర్తింపుకార్డుల జారీతో వివాదం నెలకొన్నది. ఈ క్రమంలో ఆలయం వద్దకు వచ్చిన పయ్యావులవర్గాన్ని అడ్డుకుని చెరుకూరి, కోటి పూజారులు దాడి చేశారని ఎస్ఐ తెలిపారు. ప్రతిదాడిగా చెరుకూరి, కోటి పూజారులపై పయ్యావుల వర్గం వారు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా పడ్డారని, ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ఆలయంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్టు ఎస్ఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

- ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పించండి
- నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మార్చి 21 : వేసవిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎండలు అధికంగా ఉన్నందున ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎదురైతే పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ నంబర్ 08455 276155 ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ చలివేంద్రాలు, బస్టాండ్లలో నీడ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మూగజీవాలకు తాగునీటి సౌకర్యం, హరితహారం నర్సరీల్లో షేడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, పంచాయతీ సిబ్బంది, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే కూలీలకు కూడా తాగు నీరు, నీడ సౌకర్యాలు కల్పించాలన్నారు. అడవులకు నిప్పు పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మిషన్ భగీరథ ఎస్ఈ రఘువీర్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, డీఆర్డీవో జ్యోతి, డీపీవో సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉదయం నుంచే పోలింగ్‌కు వచ్చేలా చూడాలి

- సమస్యాత్మక కేంద్రాల్లో అవగాహన కల్పించండి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, మార్చి 21 : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచే పోలింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట తండాలో కొత్తగా ఏర్పాటైన పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో వసతులపై కలెక్టర్ ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి నాగరత్నంను అడిగి తెలుసుకున్నారు. సంగాయిపేట, లంబాడి తండా పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు ఓటింగ్ కొనసాగుతుందని ఎస్ఐ మహ్మద్‌గౌస్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ గఫార్ మియా, ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు తదితరులున్నారు. అనంతరం మండల పరిధి రంగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా వైద్యాధికారులు పనిచేయాలని తెలిపారు. రోగుల గది, లేబర్ రూం, మందుల స్టోరేజ్‌ను పరిశీలించారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయనిర్మల, రంగంపేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్షిత, సీహెచ్‌వో సుదర్శన్, సిబ్బంది తదితరులున్నారు.



సంగాయిపేట తండాలో కొత్తగా ఏర్పాటైన పోలింగ్‌స్టేషన్ పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజు

చెక్‌పోస్టు తనిఖీ

పాపన్నపేట, మార్చి 21 : నార్సింగ్ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ బృందాల పనితీరుపై ఆరా తీశారు. వారికి పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తదితరులు ఉన్నారు.

కుటుంబంతో బైక్‌పై సరదాగా..

మెదక్ అర్బన్, మార్చి21: సాధారణంగా కలెక్టర్ అంటే.. హడావుడి వేరుగా ఉంటుంది. కాలు బయటకు పెట్టారంటే.. అధికార గణం పరుగులు పెడుతుంది. కానీ, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తీరు అందుకు భిన్నంగా ఉంది. సాదాసీదాగా తిరిగేస్తున్నారు. గురువారం సాయంత్రం కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలో సరదాగా షికారు చేశారు. హెల్మెట్ పెట్టుకుని బైక్‌పై తన కుటుంబ సభ్యులతో కలిసి పట్టణ రోడ్లపై తిరిగారు. క్యాంపు కార్యాలయం నుంచి బైక్‌పై మెదక్ పట్టణంలోని పలు ప్రాంతాలను కుటుంబసభ్యులకు చూపుతూ, యూనియన్ బ్యాంకు సర్కిల్ వరకు వచ్చి తిరిగి క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. సెక్యూరిటీ సిబ్బంది కూడా వెనకాలే ఓ బైక్‌పై కలెక్టర్‌ను అనుసరించారు.

వరద నీటికి అడ్డుకట్ట..!

- ప్రవాహం కిందికి రాకుండా ఫాంహౌజ్‌ల్లో కుంటలు
- ఎండుతున్న చెరువులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో రైతాంగం

కొండాపూర్, మార్చి 21: ప్రకృతి సిద్ధంగా వచ్చే వరదను కొందరు చెరపడుతున్నారు. కిందికి రాకుండా తమ ఫాంహౌజ్ పరిధిలో కుంటలు తవ్వి అడ్డుకుంటున్నారు. దీంతో కింది భాగంలోని చెరువుల్లోకి సహజసిద్ధంగా రావాల్సిన వరద రాకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. అదే క్రమంలో కొన్ని పరిశ్రమలు వ్యర్థ జలాలను వదిలేస్తుండటంతో చెరువుల్లో చేరి భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. చెరువుల్లో చేపలు చనిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలంలో వరదనీటి దుస్థితి ఇది.

ఇలా ఆపుతున్నారు..

రంగారెడ్డి జిల్లా గాజులుగూడ శివారులో నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో కురిసే వర్షపు నీరు కాలువల ద్వారా కొండాపూర్ మండలంలోని గుంతపల్లి చెరువులోకి వచ్చి చెరువు నిండేది. అయితే, ఈ చెరువుకు పైభాగంలో ఓ ఫాంహౌజ్ యాజమాని వర్షపు నీరు కిందికి రాకుండా తన భూమిలో చిన్నపాటి చెరువును తవ్వించాడు. దీంతో ఆ చెరువు ఎప్పుడూ నిండుకుండలా ఉంటోంది. ఆ నీటితో తన వ్యవసాయ అవసరాలను తీర్చుకుంటున్నాడు. దీంతో గుంతపల్లి చెరువుకు ఎటువైపు నుంచి వర్షపు నీరు వచ్చే అవకాశం లేకుండా పోవడంతో ఆ చెరువులో చుక్క నీరు ఉండడం లేదు. భూగర్భజలాలు అడుగంటి ఆ పరిసరాల్లోని వ్యవసాయ బోర్లలో నీరుండటం లేదు.

వికారాబాద్ జిల్లాలోని ఎల్లకొండ, మైతాబ్‌ఖాన్‌గూడ తదితర ప్రాంతాల పరిధి నాలుగు కిలోమీటర్ల పరిధిలో కురిసిన వర్షపు నీరు సంగారెడ్డి జిల్లాలోని మునిదేవునిపల్లి, గండిగుట్ట కుంటల్లోకి చేరేది. దీంతో చెరువు అలుగుపోసి.. ఆ నీరు పెద్దవాగు ద్వారా మల్కాపూర్ పెద్దచెరువులోకి వచ్చేది. అయితే, ఆ కుంటల పైభాగంలోని బుగ్గ రామేశ్వరం శివారులోని ఓ ఫాంహౌజ్ యజమాని వర్షపు నీటి కాలువలకు అడ్డుగా పెద్ద గుంత తవ్వి అడ్డుకట్ట వేశాడు. దీంతో పై నుంచి వచ్చే వరద ఆగిపోయింది. ఇదేమిటని కొందరు రైతులు ప్రశ్నిస్తే.. వారిని భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు, పోలీసు కేసులు పెట్టినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షపు నీటితో కలిపి..

సంగారెడ్డి జిల్లాలోని మల్లేపల్లి శివారులోని పరిశ్రమల వారు వర్షపు నీటిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థ, రసాయన జలాలను వర్షం పడిన సమయంలో గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేస్తున్నారు. దీంతో వర్షపు నీటితో పాటు కలుషిత జలాలు దగ్గరలోని చెర్లగోపులాపురం చెరువులోకి చేరుతున్నాయి. ఈ చెరువు నుంచి నీరు మల్కాపూర్ పెద్ద చెరువులోకి చేరుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం దక్కడంలేదు.



మునిదేవునిపల్లి ఫాంహౌజ్‌లో వర్షపు నీటి కాలువకు అడ్డుగా వేసిన కట్ట



పరిశ్రమ నుంచి బయటకు వదులుతున్న కాలుష్య వ్యర్థాలు



ఎస్‌జీ కూల్‌డ్రింక్ పరిశ్రమలో నుంచి వెలువడిన వ్యర్థ జలాలు

అడిగినందుకు కేసులు పెట్టారు..



వర్షపు నీటికి అడ్డుగా కుంట తవ్వారని గ్రామానికి చెందిన రైతులు వచ్చి చెప్పడంతో ప్రజాప్రతినిధిగా రైతులతో కలిసి వెళ్లి అడిగాను. ఫాంహౌజ్ యజామాని 'నువ్వు ఎవ రైతే నాకేంటి, పనులు ఆపను' అంటూ దురుసుగా మాట్లాడాడు. నాపై, రైతులపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ విషయాన్ని ప్రజావాణిలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

\- మల్లేశం యాదవ్,
మాజీ ఎంపీటీసీ, మునిదేవునిపల్లి

నోటీసులిచ్చి.. కేసులు పెట్టాం

మునిదేవునిల్లి ఫాంహౌజ్‌లో వర్షపు నీటి కాలువకు అడ్డుకట్టలు వేసినట్లు తెలుసుకుని.. నోటీసులు ఇచ్చి.. కేసులు పెట్టాం. కానీ, ఫాంహౌజ్ యజమాని మాపై కూడా కేసు పెట్టారు. మరో ఫాంహౌజ్‌లో వరద నీటికి అడ్డుకట్ట వేసిన విషయం మా నోటీసుకు రాలేదు. అలా జరిగితే, చర్యలు తీసుకుంటాం.

\- చక్రవర్తి, ఇరిగేషన్ ఏఈ

పుల్కల్‌లో 'పది' ఆంగ్ల పరీక్ష ప్రశాంతం

పుల్‌కల్, మార్చి 21: ఉమ్మడి పుల్కల్ మండలంలో పదో తరగతి ఆంగ్ల పరీక్ష మూడోరోజు ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను గురువారం మండల విద్యా శాఖాధికారి దండు అంజయ్య ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 189 మంది విద్యార్థులకు 189 మంది హాజరవగా వందశాతం పరీక్షా రాశారని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 184 మంది విద్యార్థులకుగాను 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా, ఒకరు గైర్హాజరయ్యారు. పెద్దారెడ్డిపేట జిల్లా పరిషతు ఉన్నత పాఠశాలకు చెందిన ఓ బాలిక అనారోగ్యం కారణంగా పరీక్షకు హాజరుకాలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, బాలికతో మాట్లాడి ముందు వచ్చే నాలుగు పరీక్షలు రాయిస్తామన్నారు.

రంగోత్సవంలో విద్యార్థులకు అవార్డుల పంట

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 21: సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ రంగోత్సవం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ పాండు గురువారం తెలిపారు. గతనెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈపోటీల్లో పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పదో తరగతి విద్యార్థి పి.అర్జున్ అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించి ప్రఖ్యాత ఎంఎఫ్ హుస్సేన్ అవార్డు పొందాడు. మిగిలిన 13 మంది విద్యార్థుల్లో నలుగురికి అంతర్జాతీయ మెరిట్ అవార్డులు, ఐదుగురికి గోల్డ్‌మెడల్స్, నలుగురికి కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. విద్యార్థులను ప్రోత్సహించిన టీచర్ మణివర్మ, ప్రిన్సిపల్ పాండులకు ట్రోఫీ, మోటివేషన్ సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేసినట్లు ప్రిన్సిపల్ పాండు తెలిపారు.

వంతెనలు సరే.. అప్రోచ్ రోడ్డు నిర్మాణలేవీ?

- మంజీరా నదిపై రెండుచోట్లా బ్రిడ్జిల నిర్మాణం
- ఒకవైపు రోడ్డు వేసి, మరోవైపు మరిచిన వైనం
- దూరభారంతో ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పాపన్నపేట మండలం రామతీర్థం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే రెండు ఉమ్మడి జిల్లావాసులకు మేలు

పాపన్నపేట, మార్చి 21: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రామతీర్థం, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామాల శివారు నుంచి ప్రవహిస్తున్న మంజీరానదిపై 2017లో అప్పటి ప్రభుత్వం రూ.18 కోట్లతో వంతెనను నిర్మించింది. పాపన్నపేట మండలమే కాకుండా టేక్మాల్, జోగిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు, హైదరాబాద్ పరిసర మండలాలకు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు ఈ వంతెన నిర్మాణంతో దూరభారం తగ్గుతుందని బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టింది. ఈ మేరకు వెంకంపల్లి వైపు తాండూరు గేటు వరకు 5.75కిలో మీటర్ల వరకు తారు రోడ్డును నిర్మించారు. పాపన్నపేట మండలం రామతీర్థం వైపు 4 కిలో


జోగిపేట: అల్మాయిపేట వైపు ధ్వంసమైన మట్టిరోడ్డు


పాపన్నపేట: మంజీరా నదిపై పూర్తయిన వంతెన

మీటర్ల అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారింది. వంతెన నుంచి పాపన్నపేట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దీంతో రెండు జిల్లాల సరిహద్దు ప్రజలు ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. అప్పట్లో ఎల్లారెడ్డి, మెదక్ ఎమ్మెల్యేల మధ్య పొరపొచ్చాల వల్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదన్న విమర్శలొస్తున్నాయి.

అదనంగా కిలోమీటర్ల మేర ప్రయాణం

వంతెనకు ఒకవైపు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో పాపన్నపేట మండల ప్రజలు కామరెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలానికి వెళ్లేందుకు మెదక్, ఎల్లారెడ్డి మీదుగా 40కిలో మీటర్ల దూరం ప్రయాణించాలి. ఎల్లారెడ్డికి వెళ్లాలంటే మెదక్ పట్టణం మీదుగా 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పాపన్నపేట మండలం రామతీర్థం వైపు అప్రోచ్ రోడ్డు పూర్తయితే కేవలం 22కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల ప్రజలు సంగారెడ్డికి వెళ్లడానికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి దూర భారం తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుంది.


జోగిపేట: 2012లో నిర్మించిన వంతెన

అల్మాయిపేట వైపు నిర్మిస్తే ప్రజలకు మేలు

జోగిపేట, మార్చి 21: కోట్లాది రూపాయలు వెచ్చించి వంతనెను నిర్మించినా అప్రోచ్ రోడ్డును నిర్మించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అందోలు మండలంలోని అల్మాయిపేట శివారు, హత్నూర మండలం కొన్యాల శివారులోని మంజీర నదిపై రూ.11.16 కోట్లతో వంతెనను నిర్మించి, 2012లో అప్పటి మంత్రి సునీతారెడ్డి ప్రారంభించారు. అనంతరం హత్నూర మండలంలోని కొన్యాల నుంచి వంతెన వరకు తారు రోడ్డును నిర్మించి, అందోలు మండలంలోని అల్మాయిపేట వైపు నిర్మించకుండా వదిలేయడంతో మట్టిరోడ్డే మిగిలింది. దీంతో చిన్నపాటి వర్షానికే ఈ రోడ్డు బురదమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నది. ప్రస్తుతం ఆ రోడ్డు ధ్వంసమై, మోకాలి లోతు గుంతలతో ఉన్నది. అల్మాయిపేటకు 4 కిలోమీటర్లు, చౌటకూరు వైపు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. 6 కిలోమీటర్ల మేర ఉన్న ఫార్మేషన్ రోడ్డును తారు రోడ్డుగా మారిస్తే అందోలు, నర్సాపూర్ నియోజకవర్గాల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సమస్యపై దృష్టిసారించి బీటీ రోడ్డుగా మార్చాలని ఇరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.178 కోట్ల రుణాలు

- ఉమ్మడి జిల్లాలో మూడు వాటర్ షెడ్, 46 ఎఫ్‌పీవో, మరికొన్ని ప్రాజెక్టులు
- 26 ఫ్యాక్స్‌ల ద్వారా 48 గోడౌన్ల నిర్మాణం
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ
- వ్యవసాయరంగంపై ఆసక్తి పెరిగేలా యువతకు శిక్షణ
- 'ఆంధ్రజ్యోతి'తో నాబార్డ్ ఉమ్మడి జిల్లా డీడీఎం సెసిల్‌తిమెతి


నాబార్డ్ డీడీఎం సెసిల్‌తిమెతి

గజ్వేల్‌టౌన్, మార్చి 21: నాబార్డ్ ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.178 కోట్ల రుణాలు అందిస్తున్నట్లు నాబార్డ్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి మేనేజర్(డీడీఎం) సెసిల్‌తిమెతి పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్) ద్వారా ఉమ్మడి జిల్లాలో గోడౌన్స్ కోల్డ్ స్టోరేజీ తదితర నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 3 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు కొనసాగుతుండగా, ఇటీవల 2 పూర్తయ్యాయన్నారు. జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ పరిధిలో 2 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు చేపట్టగా ఏడు గ్రామాలకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు. ఈ వాటర్‌షెడ్లను ఆ గ్రామస్థులకు అప్పగించామని తెలిపారు. అలాగే సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో మరో వాటర్‌షెడ్ ప్రాజెక్టు పనులు నడుస్తున్నాయన్నారు. 46 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుచేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని సెసిల్ తిమెతి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 5 క్లైమేట్ ప్రూఫ్ ప్రాజెక్టులు చేపట్టామని, సంగారెడ్డి జిల్లాలో మూడు, సిద్దిపేట జిల్లాలో రెండు నడుస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని 26 కోఆపరేటివ్ సొసైటీల ద్వారా 48 ప్రాజెక్టులను మంజూరు చేశామని, వీటిద్వారా గోడౌన్ నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, వేవ్ బ్రిడ్జి తదితర నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు. నాబార్డ్ ద్వారా స్వయం ఉపాధి సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) స్వయం ఉపాధిపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మగ్గం వర్క్, జ్యూట్‌బ్యాగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్, టైలరింగ్ తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు మిషనరీ, మెటీరియల్స్‌ను కూడా అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం నుంచి యువత దూరం కాకుండా, యువకులు ఆకర్షితులయ్యేలా అగ్రికల్చర్ వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ఆటోమెకానిక్, సెమీ నర్సింగ్ శిక్షణలు నిర్వహిస్తున్నామని నాబార్డ్ డీడీఎం సెసిల్ తిమెతి తెలిపారు.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలో ఐఐటీల ముందంజ

- ఘనంగా హైదరాబాద్ ఐఐటీ వ్యవస్థాపక దినోత్సవం

పటాన్‌చెరు, మార్చి 21: శాస్త్ర సాంకేతిక పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ అన్నారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ శ్రేణి నాణ్యమైన బోధన చేయడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడమే ఐఐటీల లక్ష్యమన్నారు. దశాబ్ద కాలంలో మెరుగైన పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా అంతరిక్ష, వైద్య రంగంలో సాధించిన పురోభివృద్ధి, స్వయం సమృద్ధి దేశాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిలుపుతోందన్నారు. అద్భుతమైన సవాళ్లకు సమాధానాలు చెబుతున్న అంకుర (స్టార్టప్) పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మెరుగైన పరిశోధనలకు హైదరాబాద్ ఐఐటీలో మౌలిక వసతులు ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ ఐఐటీలో అద్భుతాల ఆవిష్కరణ జరుగుతాయని భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా క్వాంటంకంప్యూటింగ్, కమ్యూనికేషన్, క్వాంటంసెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటంమెటీరియల్స్, డిజైన్ల రంగాలలో ఎంతో ప్రగతి సాధించామన్నారు. ఐఐటీ హైదరాబాద్ బోర్డు చైర్మన్ బీవీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటైన 16ఏళ్లలో ఎన్నో మైలురాళ్ల అధిగమించామన్నారు. కొత్త తరం ఐఐటీగా ఆధునిక శాస్త్ర సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలను చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ అనేక ప్రతిష్ఠాత్మక ఫ్లాగ్‌షిప్ పరిశోధనా భాగస్వామ్య ప్రాజెక్టులతో ఐఐటీహెచ్ విద్యార్థులు కలిసి పనిచేస్తున్నారన్నారు. ఐఐటీ హైదరాబాద్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌కు కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ రూ.500 కోట్ల నిధులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఐఐటీహెచ్ కేవలం సాంకేతిక పట్టభద్రులను ఉత్పత్తి చేయమే కాకుండా పరిశోధకులను తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌భూషన్ పానిగ్రాహి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వి.కాంచన, అడ్మిన్ డీన్ రంజిత్‌రామదురై, ఏసీఆర్ అడ్మిన్ డాక్టర్ ముద్రికాఖండేల్వాల్, ఎస్ఆర్‌సీ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌శర్మకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు.



మాట్లాడుతున్న జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

అల్లాదుర్గం, మార్చి 21: ఎంతో ప్రసిద్ధి చెందిన అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న ధ్వజ స్తంభ ప్రతిష్ఠ రెండోరోజైన గురువారం కన్నుల పండువగా సాగింది. పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు వేదమంత్రోశ్చరణలో ఉదయం నుంచే ఉత్సవాలు జరిపారు. ఆవాహిత దేవాతాపూజ, మూలమంత్ర హోమం, మహాస్నపనం, ధ్యాన్యాధివాసం, సుదర్శన హోమంతో పాటు శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలోల అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, స్థానిక ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.


వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న క్రాంతికిరణ్, గాలి అనిల్‌కుమార్

రైతును బలిగొన్న విద్యుత్ కంచె

- పంట రక్షణకు కంచె ఏర్పాటు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన రైతుకు దేహశుద్ధి
- సంగారెడ్డి జిల్లా కల్హేర్ కొత్తచెరువు తండాలో ఉద్రిక్తత


విద్యుత్ కంచె తగిలి మృతిచెందిన ధరావత్ రాంసింగ్

కల్హేర్, మార్చి 21: అడవి పందుల బారి నుంచి జొన్న పంటను కాపాడుకోవడానికి కౌలు రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి ఓ యువరైతు మృతిచెందగా మృతుడి కుంటుంబీకులు కౌలు రైతును చితకబాదిన సంఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోమ్యానాయక్ తండాకు చెందిన ధరావత్ రాంసింగ్(38) కల్హేర్‌కు చెందిన కస్ప పెంటయ్యకు చెందిన భూమిని కౌలుకు తీసుకోగా అందులో జొన్న పంటను వేశారు. ఆయన పక్కనే దేవసోత్ శరవణ్ అందె నాగయ్యకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని జొన్న పంటను వేశాడు. ఈ పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవడానికి విద్యుత్ తీగలతో కంచె ఏర్పాటు చేశాడు. ప్రతిరోజు రాత్రి కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, మరుసటి రోజు ఉదయం తీసేవాడు. అలాగే బుధవారం రాత్రి కంచెకు కనెక్షన్ ఇచ్చిన శరవణ్ తెల్లవారి సరఫరా నిలిపివేయలేదు. అయితే, తన పంటకు నీరు పెట్టేందుకు గురువారం ఉదయం పొలానికి వెళ్లిన ధరావత్ రాంసింగ్ దీనిని గమనించ లేదు. కంచెకు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కంచెకు విద్యుత్ సరఫరా ఇచ్చి ఉదయం 8 గంటలైనా నిర్లక్ష్యంగా కల్హేర్‌లోనే ఉన్న శరవణ్‌ను సంఘటనా స్థలానికి తీసుకొస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో ధరావత్ రాంసింగ్ బంధువులు దేవసోత్ శరవణ్‌కు దేహశుద్ధి చేశారు. అడ్డువచ్చిన మరో ఇద్దరిని కూడా కొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న కల్హేర్ ఎస్ఐ వెంకటేశం, ఏఎస్ఐ అంజయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మృతుడి బంధువులు, తండావాసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. బలవంతంగా పోలీసులు అక్కడి నుంచి రాంసింగ్ మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. రాంసింగ్ భార్య ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హసన్‌మీరాపూర్‌లో విద్యార్థి ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 21: దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బాల్తే కనకయ్య, తల్లి దేవవ్వ దంపతులు గొర్రెకాపరులుగా జీవనోపాధి పొందుతున్నారు. వీరికి కూతురు అర్చన(20), కుమారుడు అమర్(18) ఉన్నారు. కుమారుడు గతేడాది ఇంటర్‌లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఈసారి తిరిగి పరీక్షలు రాశాడు. కాగా గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు


కుమార్(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతిచెందిన సంఘటన వెల్దుర్తి మండలం రామాయిపల్లి, టేక్మాల్ మండలం తంపులూరు గ్రామాల్లో చోటు చేసుకున్నది. వెల్దుర్తి మండలం రామాయిపల్లి గ్రామానికి చెందిన అరిగే కుమార్(42) తల్లి పోచమ్మతో కలిసి నివాసముంటున్నాడు. భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె జిన్నారంలో ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన కుమార్ బుధవారం వరకు ఇంటికి రాలేదు. అయితే గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఓ గుడిసెలో శవమై కనిపించాడు. కుమార్ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో గురువారం ఉదయం మెదక్ నుంచి వచ్చిన డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలు ఆధారాలు సేకరించారు. మృతుడి సోదరుడు అరిగే శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు. మృతిదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తంపులూరు గ్రామంలో..


సంగమ్మ(ఫైల్)

టేక్మాల్, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. టేక్మాల్ మండలం తంపులూర్ గ్రామానికి చెందిన దుబ్బగల్ల సంగమ్మ(44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆరునెలల క్రితం భర్త మృతిచెందాడు. కుమారుడు హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి యధావిధిగా ఇంట్లో పడుకున్నది. అయితే ఇంటికి తాళం వేసి ఉండడంతో గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడికి సమాచారమందించారు. కుమారుడి సూచన మేరకు తాళం పగులగొట్టి చూడగా సంగమ్మ విగత జీవిగా పడి ఉన్నది. దాంతో కుమారుడికి, పోలీసులకు సమాచారం అందజేయగా తంపులూరు వచ్చారు. శరీరంపై గాయాలు ఉండడంతో హత్యచేసినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌లతో విచారణ చేపట్టారు.


మండలంలో సాగవుతున్న మొక్కజొన్న

మొక్కజొన్నకు తెగుళ్ల బెడద

- రాత్రికి రాత్రే పంటను నాశనం చేస్తున్న కత్తెర పురుగు
- మందులు పిచికారీ చేసినా.. తగ్గని ఉధృతి

కోహెడ, మార్చి 21: యాసంగి(రబీ)లో మొక్కజొన్న సాగుచేసిన రైతులకు తెగుళ్ల బెడద పట్టుకున్నది. పంటకు కత్తెర పురుగు, లద్దె పురుగు సోకి పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. రాత్రికిరాత్రే పంటను నాశనం చేస్తున్నాయి. రసాయన మందులు ఇప్పటికే రెండుసార్లు పిచికారీ చేసినా... ఫలితం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వానాకాలంలో పత్తి, వరి పంట వేసినా దిగుబడి రాలేదు. అలాగే నీటి కొరత ఉండడంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న ఎక్కువగా సాగుచేశారు..

పెరిగిన జొన్న సాగు

గతేడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. మండల వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు సులువుగా సాగుచేసే అవకాశం ఉండడంతో రైతులు సాగుచేసేందుకు ముందుకు వచ్చారు. కొంత పంట ఇప్పటికే రైతుల చేతికి వచ్చింది. మరికొంతమంది నీటి కొరత లభ్యం చూసుకుని ఆలస్యంగా మొక్కజొన్న పంటలు వేశారు. చేతికొచ్చే సమయంలో పంటలకు రోగాలు సోకి దెబ్బతింటున్నాయి. దిగుబడి సైతం ఎకరానికి దాదాపుగా 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తున్న. కానీ ప్రస్తుతం కత్తెర పురుగు, లద్దె పురుగు సోకడంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు..

దిక్కుతోచని స్థితిలో రైతులు

జొన్న సాగుచేసిన రైతులను కత్తెర పురుగు, లద్దె పురుగుతో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో రైతులు ఆశలు వదులు కోవాల్సిన వస్తోంది. రసాయన మందులు పిచికారీ చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. ఆకులను తింటూ రంధ్రాలు చేస్తున్నాయి. దీంతో పంటను ఎలా కాపాడుకోవాలని మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు..

గుళికలు వాడాలి: భోగేశ్వర్, ఏవో, కోహెడ

ప్రస్తుతం కత్తెర, లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉన్నది. పంట రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏఈవోల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పురుగు ఉధృతి అరికట్టేందుకు తావుడు, బెల్లం, నూనెతో చేసిన గుళికలు వినియోగించాలి.

సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్‌కల్, మార్చి 21: సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ సీటును నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని, ఇందుకు బూత్‌స్థాయి కార్యకర్తలే అత్యంత కీలకమన్నారు. పదేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నదన్నారు. తాను ఇటీవల బీజేపీలో చేరానని, మరోసారి ఎంపీగా ఆదరించి అవకాశం ఇవ్వాలని బీబీ పాటిల్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, న్యాయవాది బస్వరాజ్ పాటిల్, బీజేపీ మండలాల అధ్యక్షులు ప్రవీణ్, పండరి, ప్రవీణ్‌రెడ్డి, రాకేశ్, సాయి, వెంకట్, శ్రీనివాస్, పుట్టి మోహన్, అనిల్, మహదేవ్ పాల్గొన్నారు. కాగా మండల కేంద్రమైన చౌటకూర్‌తో పాటుగా కోర్పోలు గ్రామాలకు చెందిన వంద మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, విఠల్‌రెడ్డి, పెద్దారెడ్డిపేటకు చెందిన రమేశ్‌బస్వరాజ్‌పాటిల్, చౌటకూర్ మాజీ సర్పంచ్ గొంగ్లూరు జనార్ధన్‌ముదిరాజ్, నాయకులు రియాజ్, సార అంజనేయులు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

జహీరాబాద్, మార్చి 21: బీజేపి గెలుపుకోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషిచేశానని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ హవా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీలో చేరేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహం చూపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ బూత్‌స్థాయిలో బీజేపీని మరింత పటిష్ఠవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. ఇదిలా ఉండగా జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్ తదితర మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. సజ్జాపూర్ గోవర్ధన్‌రెడ్డి, దేశెట్టిపాటిల్, రంజోల్‌కు చెందిన సత్యం ముదిరాజ్ బృందం, క్రిష్టారెడ్డి, పలువురు లింగాయత్ సమాజ్ నాయకులు, అందోల్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌బండారీ, జిల్లా నాయకులు నౌబాద్ జగన్, నియోజకవర్గ నాయకులు జనార్ధన్‌రెడ్డి, మండలాధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీకటి రాజకీయాలు మానుకోవాలి: రఘునందన్‌రావు

హవేళిఘణపూర్/మాసాయిపేట, మార్చి 21: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీకటి రాజకీయాలు మానుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకరు బలమైన అభ్యర్థిని పెడితే, మరొక్కరు బలహీనమైన అభ్యర్థిని పెట్టేలా ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా మెదక్‌లో కాషాయజెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కూచన్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, రాష్ట్ర నాయకురాలు కరణం పరిణిత పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని గేట్లు తెరిచినా ప్రజలు నో కాంగ్రెస్, నో బీఆర్ఎస్ అంటున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. మాసాయిపేట మండలం కేంద్రంలో మెదక్ పార్లమెంటరీ స్థాయి ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, బీఆర్ఎస్ కనుమరుగవుతున్నదని చెప్పారు.


హవేళిఘణపూర్: సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మార్చి 21: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరు, విద్యార్థుల హాజరు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 68 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఇంగ్లీష్ పరీక్షకు 10,310 మంది విద్యార్థులకు గానూ.. 10,289 మంది హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు.

మెదక్ జిల్లాలో వంద శాతం పోలింగే లక్ష్యం

మెదక్ అర్బన్, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ జిల్లాలో వంద శాతం పోలింగే లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పోలింగ్‌లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతీ ఒక్కరు ఓటు వేయాలన్నారు. గురువారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఫారం-6 నింపి ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకొని ఉత్సాహంగా ఓటు వేసి మెరుగైన పోలింగ్ నమోదుకు కృషి చేసినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ హుస్సేన్ పాల్గొన్నారు.



చేగుంట సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గియా ఉన్నిసా బేగం

చేగుంటలో బీఎల్వోల సమావేశం

చేగుంట: చేగుంట పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో తహసీల్దార్ గియా ఉన్నిసా బేగం గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని వృద్ధులు, దివ్యాంగులు, ఓటర్ల వివరాలను సేకరించి ఫామ్ 12డిలో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సర్వేయర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలివ్వాలి



ప్రభుత్వాస్పత్రి అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు

జహీరాబాద్, మార్చి 21: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మహిపాల్ కోరారు. ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు గురువారం ఆస్పత్రి అధికారి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత రెండునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాల పోషణ భారంగా మారుతుందన్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుధాకర్, ఎలిషా, పవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీ నియామకం

చేగుంట, మార్చి 21: చేగుంట మండలం బి.కొండాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని మండలాధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నియమించారు. అధ్యక్షుడిగా డేగరి రమేష్, ఉపాధ్యక్షుడిగా గోర్మిల శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీగా చంద్రం, యూత్ కమిటీ అధ్యక్షుడిగా పొలిటి మహిపాల్, సోషల్ మీడియా కన్వీనర్‌గా నర్సింహులు, మహిళా అధ్యక్షురాలిగా వడ్యారం ఉమారాణి, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా గౌరీ దయాకర్, బూత్ కమిటీ సభ్యులుగా నాగరాజు, నీరుడి స్వామిలను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మాసాయిపేట శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మోహన్ నాయక్, గ్రామ సీనియర్ నాయకులు అల్లి అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రామస్వామి పాల్గొన్నారు.

టిప్పర్లు సీజ్

కొల్చారం, మార్చి 21: కొల్చారం మండలం రాంపూర్ కంకర మిషన్ నుంచి అక్రమంగా కంకరను తరలిస్తున్న రెండు టిప్పర్లను జిల్లా మైనింగ్ శాఖ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ గురువారం సీజ్ చేశారు. రాంపూర్ కంకర మిషన్ నుంచి వేబిల్లులు లేకుండా కంకరను తీసుకెళ్తున్న టిప్పర్లను గురువారం ఉదయం పట్టుకుని కొల్చారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఒక టిప్పర్‌కు రూ.5,600 జరిమానా విధించగా, మరో టిప్పర్ ఓవర్‌లోడ్‌తో ఉండడంతో మైనింగ్ ఏడీకి జరిమానా విధింపు కోసం పంపినట్లు తెలిపారు.

ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

జిన్నారం, మార్చి 21: పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడగా.. చికిత్స కోసం తరలించారు. గురువారం గడ్డపోతారం పరిధిలోని ఓ రియాక్టర్ల తయారీ పరిశ్రమలో ప్రమాదం జరగడంతో ఫాజిల్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

బీరు పరిశ్రమలో మొక్కలు నాటిన చుక్క రాములు

పుల్‌కల్, మార్చి 21: చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని చార్మినార్ బీరు పరిశ్రమలో సీఐటీయూ సిల్వర్ జూబ్లీ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు హాజరై పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, ఉపాధ్యక్షుడు పి.బాగారెడ్డి, ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, ఆఫీస్ బేరర్స్ నాగభూషణం, సత్యనారాయణ, మల్లారెడ్డి, చంద్రయ్య, దేవరాజ్, కమిటీ సభ్యులు యాదగిరి, విఠల్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్, విజయరాజు, విష్ణువర్ధన్‌గౌడ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సేవాభావంతో పని చేయాలి

నారాయణఖేడ్, మార్చి 21: అంబేడ్కర్, పూలే సేవా సమితి సభ్యులు సేవాభావంతో పని చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం అన్నారు. గురువారం ఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన కార్యనిర్వాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసి సేవలను మరింతగా విస్తృతం చేయడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి కమిటీలను రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయనవెంట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పండరి ఉన్నారు.

ఎల్వోసీ అందజేత

నర్సాపూర్, మార్చి 21: నర్సాపూర్ మండలం ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబానికి వైద్య చికిత్స కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2.10లక్షలకు సంబంధించిన ఎల్వోసీని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర మహిళ నాయకురాలు సుహాసినిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశం, నాయకులు రిజ్వాన్, శ్రీశైలంయాదవ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాచన్నస్వామి హుండీ లెక్కింపు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

కోహీర్, మార్చి 21: మండల పరిధిలోని బడంపేట గ్రామంలో గల రాచన్నస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఫిబ్రవరి నుంచి మార్చి 20వరకు భక్తులు స్వామివారికి సమర్పించుకున్న హుండీ ఆదాయం రూ.3.32లక్షలు వచ్చినట్లు ఆలయ ఇవో శివరుద్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇవో శివరుద్రప్ప పాల్గొన్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించాలి

● సీపీఎం నాయకుల డిమాండ్

నారాయణఖేడ్, మార్చి 21: పెండింగ్‌లో ఉన్న ధరణి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్ కోరారు. గురువారం పార్టీ డివిజన్ నాయకులు సతీష్, అరుణ్, బస్వరాజ్‌పాటిల్, అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాంతో కలిసి ఖేడ్ ఆర్డీవో అశోకచక్రవర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో దరఖాస్తులు స్వీకరించినా అనేక సమస్యలు పరిష్కారం కాలేదని, వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బస్టాప్ వద్ద అంబులెన్స్‌ల తొలగింపు



బస్టాప్ ప్రాంతంలో అంబులెన్స్‌లను తొలగించి, శుభ్రం చేయించిన దృశ్యం

సంగారెడ్డి క్రైం, మార్చి 21: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట, పట్టణ పోలీస్‌స్టేషన్ ప్రహరీని ఆనుకొని బస్టాప్ ప్రాంతంలో అంబులెన్స్‌లను నిలుపడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్పందించిన పట్టణ సీఐ ఎస్.భాస్కర్ అంబులెన్స్‌ల యజమానులను గురువారం పిలిపించి అక్కడి నుంచి తొలగింపజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ఆ ప్రాంతమంతా పరిశుభ్రంగా చేయించారు.

వందశాతం పన్నులు వసూలు చేస్తాం

● డివిజన్ పంచాయతీ అధికారి యాదయ్య

నర్సాపూర్, మార్చి 21: పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు చేస్తామని డివిజన్ పంచాయతీ అధికారి యాదయ్య తెలిపారు. నర్సాపూర్ డివిజన్‌లోని రెండు మండలాలు తప్పా మిగతా మండలాలో వందశాతం పన్నులు వసూలయ్యాయని చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డివిజన్‌లో నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, శివ్వంపేట, కొల్చారం మండలాలు, మొత్తం 140 పంచాయతీలున్నాయన్నారు. ఇప్పటివరకు నర్సాపూర్, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో వందశాతం పన్నులు వసులు కాగా శివ్వంపేట, కౌడిపల్లిలో ఈ నెలాఖరు వరకు వందశాతం పూర్తవుతుందన్నారు. డివిజన్ మొత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1.74కోట్లు లక్ష్యంకాగా ఇప్పటివరకు రూ.1.22 కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. డివిజన్ మొత్తం వందశాతం పన్నులు వసూలు చేసి జిల్లాలో ప్రథమస్థానంలో నిలుస్తామన్నారు. అందుకు ప్రజలు పన్నులు చెల్లించి అధికారులకు సహకరించాలని డివిజన్ పంచాయతీ అధికారి యాదయ్య కోరారు.

రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

మునిపల్లి, మార్చి 20: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అమ్మవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలను ఊరేగింపుగా తెచ్చి, అమ్మవారికి సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు.

జాతరలో రాజిరెడ్డి

వెల్దుర్తి: మండల పరిధిలోని మనేపల్లి గ్రామంలో జరుగుతున్న పెద్దమ్మ జాతరలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య



కొల్చారంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

కొల్చారం, మార్చి 21: వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అందుబాటులో ఉన్న నిధులతో పనులు చేయించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. కొల్చారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేయాలని సూచించారు. ప్రతీ గ్రామంలో ఉపాధి హమీ పనులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. నర్సరీలను జాగ్రత్తగా కాపాడాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని తెలిపారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సమావేశంలో డీఆర్డీఏ ఏపీడీ రంగాచారి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఏపీవో మహిపాల్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ విఠల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, నగేష్, శ్రీనివాస్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

● జహీరాబాద్ మండల సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ రాములు



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాములు

జహీరాబాద్, మార్చి 21: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. వేసవికాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాములు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడి గల గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. వేసవికాలంలో ఎండల్లో తిరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సూచనలు చేయాలని కోరారు వివిధశాఖలకు చెందిన అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, ఎంపీడీవో మాధవరెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లను ఇస్తారా?.. డీడీ డబ్బులు చెల్లిస్తారా?

● రేగోడు మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు

రేగోడు, మార్చి 21: గత ప్రభుత్వ హయాంలో గొర్రెల యూనిట్ల పథకానికి డీడీలు కట్టినా లబ్ధిదారులకు గొర్రెలు ఇవ్వలేదని, గొర్రెలు పంపిణీ చేస్తారా లేదంటే డీడీ డబ్బులు తిరిగి చెల్లిస్తారా అని అధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. గురువారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరోజన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. మండలంలో దాదాపు 80 మంది గొల్ల, కురుమలు డీడీలు కట్టినట్లు చెప్పారు. అయితే డీడీ డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పశు వైద్యాధికారి వీరేశం తెలిపారు. అనంతరం సభ్యులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించగా.. అధికారులు నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో సీతారావమ్మ, ఏఈ రమేష్, విద్యుత్ ఏఈ యాసిన్, వైస్ ఎంపీపీ వినీల, ఎంపీటీసీలు నాగిరెడ్డి, నర్సింలు, సంగీత, వ్యవసాయ అధికారి జావిద్, వైద్య అధికారి శ్వేత, ఎంఆర్ఐ ఫిరోజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ఏపీవో జగన్, సీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

హత్నూర, మార్చి 21: హత్నూర మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ ముదిరాజ్‌ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మల్కాపూర్ గ్రామానికి చెందిన బల్గురి రాజు ముదిరాజ్, పోచాగౌడ్, నర్సింహులు, నరేందర్, కృష్ణ, విష్ణు, కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర, జిల్లా నేతల సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

ఖేడ్‌కు చేరుకున్న పాదయాత్ర

నారాయణఖేడ్, మార్చి 21: దత్తగిరి మహరాజ్ 45వ వార్షిక అమరతిథిని పురస్కరించుకొని ఆయన జన్మస్థలమైన మనూరు మండలం బెల్లాపూర్ నుంచి ప్రారంభించిన పల్లకీ సేవ, రథయాత్ర, పాదయాత్ర గురువారం సాయంత్రం నారాయణఖేడ్‌కు చేరుకుంది. బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతులు అవదూత్‌గిరి మహరాజ్, సిద్దేశ్వర్ మహరాజ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నారాయణఖేడ్ దత్తగిరి ఆశ్రమానికి చేరుకుంది. దత్తగిరి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కాశీనాథ్‌పటేల్, శివ్‌లింగ్‌పటేల్, ముత్యంహన్మండ్లు, కిష్టయ్యమాస్టార్ ఘన స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీలు

చేగుంట, మార్చి 21: మెదక్ జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మేకల జయరాములు ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు గురువారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని తన నివాసంలో కలిశారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో చేపడుతున్న శివ మార్కండేయ ఆలయ నిర్మాణ కోసం సహకారం అందించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పద్మశాలీ సంఘం సభ్యులు నక్క ప్రభు, నక్క రాములు, నక్క దశరథ్, నక్క వెంకటేశం తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సంగారెడ్డి రూరల్, మార్చి 21: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల అసోసియేషన్ నాయకులు వీఆర్‌సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు విన్నవించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శివశంకర్‌ను గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేసిక్ పే స్కేల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పే స్కేల్‌తో సమానంగా ఉండేలా చూడాలని, వ్యవసాయ అధికారికి వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో వ్యవసాయ అధికారుల అసోసియేషన్ చైర్మన్ కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మానస తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ భాస్కర్

సంగారెడ్డి క్రైం, మార్చి 21: ఆటో డ్రైవర్లకు గురువారం పట్టణ సీఐ ఎస్.భాస్కర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మద్యం సేవించి ఆటోలు నడపకూడదని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. పట్టణంలోని అన్ని ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయిస్తామని ఆయన తెలిపారు. ప్రయాణికులను క్షేమంగా తీసుకెళ్లే బాధ్యత ఆటో డ్రైవర్‌పై ఉన్నదని చెప్పారు. ఈ సమావేశంలో ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు తాహేర్ పాషా పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

రామయంపేట, మార్చి 21: ఈ నెల 27నుంచి ప్రారంభం కానున్న పెద్దమ్మ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ సదర్ సంఘం అధ్యక్షుడు పోచమ్మల సిద్ధిరాములు నేతృత్వంలో నరేష్, భూమ రమేష్, దేవుని నర్సింహులు ఆవిష్కరించారు.

గాలి అనిల్‌కుమార్ గెలుపునకు కృషి చేస్తాం

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, మార్చి 21: జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీమెజార్టీతో గెలిపించేందుకు సంఘటితంగా కృషి చేస్తామని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం ఝరాసంగలో బీఆర్ఎస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో అన్ని రంగాలు, అన్నివర్గాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. గతంలో పనిచేసిన ఎంపీలు జహీరాబాద్ అభివృద్ధిని విస్మరించారని విచారం వ్యక్తంచేశారు. జహీరాబాద్ ఎంపీగా పోటీచేస్తున్న గాలి అనిల్ కుమార్ స్థానికుడేనని, భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించేందుకు కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. అనంతరం గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. అంతకుముందు కేతకీ సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.



ఝరాసంగంలో సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

పోషకాహారంతోనే వ్యాధి నిరోధక శక్తి



మునిపల్లిలో సామూహిక సీమంతాలు చేస్తున్న ఎంపీడీవో హరినందన్‌రావు, సీడీపీవో రేణుక

మునిపల్లి, మార్చి 21: పోషకాహారంతోనే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎంపీడీవో హరినందన్‌రావు, సీడీపీవో రేణుక అన్నారు. పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రమైన మునిపల్లి రైతు వేదికలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, కిశోర బాలికలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శైలజ, నాగమణి పాల్గొన్నారు.

మనూరులో



మనూరులో సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

మనూరు: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యమున ఆధ్వర్యంలో గురువారం మనూరులో మండల స్థాయి పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ, ఐసీడీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చందంపేటలో



చందంపేటలో గర్భిణీలు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట: మండలంలోని చందంపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పోషకాలున్న చిరుధాన్యాలు తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి సూచించారు. గర్భిణులకు సీమాంతాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, భవాని పాల్గొన్నారు.

జీడిపల్లి గ్రామంలో



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో హేమభార్గవి

మనోహరాబాద్: జీడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో హేమభార్గవి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సక్కుబాయ్, కారోబార్ హబీబ్‌ఖాన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కూలి పనికి వెళ్లిన మహిళ అదృశ్యం



జ్యోతి (ఫైల్)

సంగారెడ్డి క్రైం, మార్చి 21: పుల్కల్ మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన వడ్డె జ్యోతి(45) కూలి పని నిమిత్తం సంగారెడ్డికి ఈ నెల 15న వెళ్లి కనిపించకుండా పోయిందని పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపారు. ఆమె తండ్రి వడ్డే రాములు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు.

పస్తాపూర్‌లో వ్యక్తి..



అనిల్‌కుమార్ (ఫైల్)

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో నివాసముంటున్న మర్పల్లి అనిల్‌కుమార్ ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని జహీరాబాద్ పట్టణ ఎస్ఐ లక్ష్మారెడ్డి గురువారం తెలిపారు. పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన మర్పల్లి అనిల్ గత కొంత కాలంగా పస్తాపూర్ మేస్త్రీకాలనీలో నివాసముంటున్నాడన్నారు. ఈ నెల 16న ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదని చెప్పారు. ఆయన భార్య మర్పల్లి సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని 2కే రన్



ఖేడ్‌లో 2కే రన్‌ను నిర్వహిస్తున్నఎస్ఎఫ్ఐ నాయకులు

నారాయణఖేడ్, మార్చి 21: భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం నారాయణఖేడ్‌లో ఎస్ఎఫ్ఐ, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. పంచగామ క్రాస్ రోడ్డు నుంచి రాజీవ్ చౌక్ వరకు రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కాన్షీరాం మాట్లాడుతూ.. భగత్‌సింగ్ లాంటి మహనీయుల చరిత్రను భావితరాల వారికి తెలియజెప్పడంకోసం 2కే రన్ నిర్వహించినట్లు తెలిపారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్, అనిల్‌రెడ్డి, అరవింద్, రాజు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.